ప్రజాజ్యోతి
శుక్రవారం । 3 । మే । 2024
ఖమ్మం

# లక్ష్యసాధన కోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ విపి గౌతమ్

ఖమ్మం ప్రతినిధి మే 2 (ప్రజాజ్యోతి):



ఉన్నత లక్ష్యం ఏర్పరచుకొని, లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. ఎస్ఎస్ సి- 2024 వార్షిక ఫలితాలలో 10కి10 జీపీఏ సాధించిన 16 మంది ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులను గురువారం నూతన కలెక్టరేట్‌లో విద్యాశాఖచే నిర్వహిం చిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, విద్యార్థులను అభినందించి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులు ప్రోత్సహించి, వారు ఎంచుకున్న లక్ష్య సాధనకు సహకరించాలన్నారు. విద్యార్థులు పరీక్షకు ఎలా సంసిద్ధమయ్యారు, వారికుటుంబ నేపథ్యం, వారి భవిష్యత్ ప్రణాళికలను జిల్లా కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. విద్యార్థులు మిగతా 2లో

# టిఆర్ఎస్ బిజెపి దొందు దొందే..

## ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి అత్యధిక మెజార్టీ తో గెలుపు తథ్యం

## కార్నర్ మీటింగ్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





తిరుమలాయపాలెం, మే 2, ప్రజాజ్యోతి : తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 పార్లమెంట్ స్థానాల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి గ్రామ సహాయం రఘురాం రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపు తథ్యం అని రెవెన్యూగృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం కార్నర్‌మీటింగ్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తూ మే 13న తెలంగాణ రాష్ట్రంలో జరుగు పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంటు స్థానాల్లో ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురామిరెడ్డి మిగతా 2 లో

# ఒక్క అవకాశం ఇవ్వండి

## -మీకు సేవకునిగా పని చేస్తాను .. రఘురామిరెడ్డి

## - భారీగా కాంగ్రెస్ అభ్యర్థి ర్యాలీ - బ్రహ్మరథం పట్టిన ప్రజలు

కారేపల్లి, మే 2, ప్రజాజ్యోతి:





ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం సింగరేణి గ్రామంలో రామసహాయం రఘురామరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ప్రచార రథం పై వస్తున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు అడుగడుగున పూలు చల్లుతూ బ్రహ్మరథం పట్టారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ సమయం ఉందని అన్ని ప్రాంతాలను పూర్తిగా తిరిగి అవకాశం ఉండకపోవచ్చు అని అయినా గ్రామాలలో ఉండే ప్రతి ఒక్క కార్యకర్త నిరంతరం ప్రజలలో ఉంటూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని సంక్షేమాన్ని వివరిస్తూ గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన మెజారిటీకంటే అధికంగా పార్లమెంట్లో మెజారిటీ వచ్చే విధంగా పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో పార్టీ మోసం చేసిన ఇక్కడ ప్రజలు మాత్రం మోసం చేయకుండా కర్ర పట్టుకుని తన వెంట నిలబడ్డారని ఇప్పుడు రాబోయే ఐదేళ్ల కాలంలో మీ అందరి వెంట నేను ఉంటానని పేర్కొన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ప్రారంభమైందని ఈ రాజ్యంలో మీ నాయకులే పదవుల్లో ఉన్నారని నిరంతరం మీ సేవకే సిద్ధంగా ఉంటారన్నారు. నీ దీవెనలతో మిగతా 2లో



# దత్త పుత్రుల కోసమే మోడీ పాలన

## -బిజెపి, బిఆర్ఎస్ను ఓడించండి : నారాయణ

## -ఎర్ర జెండా స్ఫూర్తితోనే అభివృద్ధి : తుమ్మల

## - బిజెపితో బిఆర్ఎస్ పొత్తు పరోక్షం కాదు ప్రత్యక్షమే : పొంగులేటి

## - ఉద్యమ ఖిల్లాలో కూటమికి ఎదురు లేదు: కూనంనేని

ఖమ్మం ప్రతినిధి, మే 2, ప్రజాజ్యోతి:

మోడీ దత్త పుత్రులైనా అంబానీ, అదానీలతో పాటు 29 మంది కార్పొరేట్ శక్తుల కోసమే పాలన సాగిస్తున్నారని రూ. 14 లక్షల కోట్ల ఎగవేసిన వీరిని మోడీ ప్రభుత్వం కాపాడుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. ప్రధాని మోడీ తనకు కుటుంబం లేదు, అవినీతి చేయను అంటున్నారని కానీ దత్తపుత్రులంతా అవినీతిపరులేనని ఇందులో ఆరుగురు మోడీ పేరుతోనే ఉండడం గమనార్హమన్నారు. ఖమ్మం పార్లమెంటు స్థాయి సిపిఐ కార్యకర్తల సమావేశం గురువారం స్థానిక ఎస్ఆర్ గార్డెన్స్ జరిగింది. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ మోడీ మాటలు భవిష్యత్తు ప్రమాదానికి అద్దం పడుతున్నాయని మోడీ తీరును ప్రగతిశీల కాముకులు, మాజీ న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు తప్పుబడుతున్నారని మోడీ కోరుతున్న 400 సీట్లు ఇస్తే రాజ్యాంగంలో మార్పులు జరుగుతాయని ఇక ప్రజాస్వామ్యం ఉండదని హిట్లర్ పాలన కొనసాగుతుందన్నారు. మోడీ దిగజారుడు వ్యాఖ్యలు ఆయన ఓటమి భయాన్ని తెలియజేస్తున్నాయని హిందువుల మంగళ సూత్రాలు ముస్లింలకు పంచుతారన్న వ్యాఖ్యలు ఆయన భయాన్ని తెలియజేస్తున్నాయని నారాయణ తెలిపారు. మంగళసూత్రాలపై నమ్మకం లేని వ్యక్తి మంగళసూత్రాల గొప్పతనాన్ని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కుటుంబాన్ని మోసం చేసిన వాడు దేశాన్ని మోసం చేస్తారని ఆయన తెలిపారు. మోడీ కుటుంబాన్ని మోసం చేశారని ఇక దేశాన్ని మోసం చేసే కుట్రకు తెరలేపారన్నారు. బిజెపి వ్యతిరేకులపై చట్టాన్ని ప్రయోగిస్తున్నారని ఇప్పటికే ఇద్దరు ముఖ్యమంత్రులు జైలులో ఉంటే మూడో ముఖ్యమంత్రికి నోటీసు ఇచ్చారని మిగతా 3 లో

# రిజర్వేషన్లను మోడీ రద్దు చేస్తారని అనడం అసత్య ప్రచారమే ..

## -మహిళలకు రూ.2500 ఎందుకు ఇవ్వడం లేదు?

## - స్థానికేతరులకు ఓట్లు వేస్తే ఇక్కడి సమస్యలు ఎలా తెలుస్తాయి ?

## -బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం రూరల్, మే 2, ప్రజాజ్యోతి:



అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహిళలకు రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని పార్లమెంట్ ఎన్నికలు వచ్చినా ఇంత వరకు ఎందుకు ఇవ్వలేకపోయారని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు ప్రశ్నించారు. మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ వస్తుందని ఓటర్లు మిగతా 2 లో

# మూడు నెలలు శుభముహూర్తాలు లేవు

## కొత్తలంక కైలాస శర్మ



కారేపల్లి, మే 2, ప్రజాజ్యోతి:

నేటి నుంచి ఆగస్టు 5వ తారీఖు వరకు సుమారు మూడు నెలల పైచిలుకు ఎలాంటి శుభముహూర్తాలు లేవని శ్రీ విజయ విఘ్నేశ్వర అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాష్ శర్మ అన్నారు. బుధవారం సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయ పల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మూడు నెలల వరకు ఎలాంటి శుభ ముహూర్తాలు లేవు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు ఎలాంటి శుభ ముహూర్తాలు లేవని, ఈ శుభ ముహూర్తలపై ఆధారపడే జీవించే పురోహితులు, కళ్యాణ మండపం వారు, డెకరేషన్ వారు, వంటవారు, సప్లై వారు, డీజే వారు, సన్నాయి మేళం, వివిధ పేద కార్మికులకు ఆర్థిక భారం ఎక్కువై జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

రఘురామరెడ్డిని పార్లమెంట్లో కూర్చోబెడితే ఆ తరువాత జరగబోయే ప్రతి పనిలో మీ తోడుగా ఉంటాడన్నారు. ఆ దిశగానే ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసే సుభిక్షమైన ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించుకోవడంలో ప్రజలు, కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి ఇవ్వలేదు అన్నారు. గత పది సంవత్సరాలలో లక్ష యాభై వేల కోట్లు రాష్ట్ర ప్రజలదనాన్ని దోచిన కేసీఆర్ ఒక కేడిఅని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడిఒక్కటేనని దుయ్యబట్టారు. ఆస్తులు కాపాడుకోవడం కోసం, జైలుకు వెళ్లిన తన కూతురిని బయటకు తీసుకురావడం కోసం బిజెపితో లోపాయికారపొత్తులు పెట్టుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారని, ఎవరెన్ని ఎత్తులు వేసిన ప్రజా దీవెన ఉన్నంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయలేరన్నారు.రాష్ట్రంలో గత పది ఏళ్లలో మాటలు మాత్రమే వచ్చాయని ఇక రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రజలందరికీ ఇళ్ళ వస్తాయన్నారు. ఈ ప్రాంతంలో అధికంగా పోడు సమస్య ఉందని, వాటిని పరిష్కరించే బాధ్యత తీసుకుంటానన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పోడు భూములలో విద్యుత్ సరఫరా, బోర్లకు మోటార్ల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అభ్యర్థి రామ సహాయం రఘురామారెడ్డి మాట్లాడుతూ నేను నాన్ లోకల్ అంటూ పసలేని విమర్శలు చేస్తున్నారని నేను ఖమ్మం జిల్లా వాసిని నేను మాత్రమే లోకల్ అని అన్నారు. మీ అందరి అమూల్యమైన ఓటు వేసి పార్లమెంట్ కు పంపిస్తే రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ప్రజలందరికీ సేవ చేసుకుంటానన్నారు. వైరా శాసనసభ్యులు రామదాసు నాయక మాట్లాడుతూ మూడు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇదే కూడలివేదికగా తనను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో సైతం రఘురామారెడ్డి హస్తం గుర్తుపై ఓటువేసి భారీమెజారిటీతో గెలిపించాలన్నారు. మీరు వేసే ప్రతిఓటు రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఎన్నికలలో పనిచేయాలన్నారు. ఓటు వేసి గెలిపించే బాధ్యత మీది, మీ సమస్యలు తీర్చే బాధ్యత మాది అని అన్నారు. టిడిపి ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి ఆధ్వర్యంలో సింగరేణి మండల టిడిపి పద్నాలు గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, రాష్ట్ర మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల ,సొసైటీ చైర్మన్ దుగ్గిని శ్రీనివాసరావు, బానోత్ రామ్మూర్తి నాయకు, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, బోర్ర రాజశేఖర్, సిపిఐ, సిపిఎం, టిడిపి నాయకులు బొల్ల రామస్వామి, భూక్య వీరభద్రం, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శుక్రవారం ఖమ్మంలో ఆర్ఆర్ఆర్ రోడ్ షో

## -హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రేణుకా చౌదరి

ఖమ్మం ప్రతినిధి, మే 2, ప్రజాజ్యోతి:

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఈనెల మూడవ తేదీన శుక్రవారం ఖమ్మం నగరంలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ రోడ్ షోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తదితర ముఖ్యనేతలు పాల్గొంటారు. సాయంత్రం ఐదుగంటలకు మొదలయ్యే ఈరోడ్ షో జెడ్పీసెంటర్ మీదుగా బోనకల్ క్రాస్‌రోడ్,ముస్తఫానగర్ నుంచి చర్చికాం పౌండ్ చేరుకుంటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. అనంతరం అక్కడనుంచి శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి టెంపుల్ మీదుగా బోస్‌బొమ్మ సెంటర్, రాజీవ్ చౌక్ నుంచి గాంధీచౌక్ చేరుకుటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. ఈ మేరకు టూర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# లక్ష్యసాధన కోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ విపి గౌతమ్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆ లక్ష్యసాధనకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. దీనికోసం విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ తరపున తగిన మార్గదర్శనం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సోమశేఖరశర్మ, సిఎంఓ రాజశేఖర్, డిసీఈబి కార్యదర్శి నారాయణ, ఆర్ సి ఓ లు ప్రత్యూష, అంజలి, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ బిజెపి దొందు దొందే..

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నాడని ఆయన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బిజెపితో జత కలిశారని ఆయన ఆరోపించారు బి ఆర్ ఎస్ బిజెపి పార్టీలు రెండు ఒకటేనని రూపాయి కారి ఒప్పందంతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల రూపాయలు ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్నారని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పండుతుందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. ఖమ్మం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, రామ సహాయం నరేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా నాయకురాలు రామసహాయం మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జడ్పిటిసి బెల్లం శ్రీను, ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, గండ్ర గోపాలరావు, ఉన్నం రాజశేఖర్, మద్దినేని మధుసూదన్, పోట్ల కిరణ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, గుండా రఘురాం రెడ్డి, కమటం లక్ష్మణ్, భానోత్ రమేష్, మిరియాల విక్రంరెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకులు దూదిమెట్ల వెంకట్, ఎంపీటీసీ గుగ్గిళ్ళ అంబేద్కర్, సిరి గద్దె ఉపేందర్, పుసులూరి సురేష్, తాటికొండ కిరణ్, కొలిచలం వెంకటేశ్వర్లు, గోళ్ళ లింగయ్య, చామకూరి శ్రీనివాస్, కాంగ్రెస్ యువజన నాయకులు దూదిమెట్ల వెంకట్, లాజరస్, దొడ్డ గురవయ్య, మెట్టు రవి, పోలె పొంగు సంజీవులు, శ్యామ్ సుందర్ రెడ్డి, కొమ్ము భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లను మోడీ రద్దు చేస్తారని అనడం అసత్య ప్రచారమే

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచారం లో భాగంగా భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుమాట్లాడుతూ....మన కోసం.. మన అభివృద్ధి కోసం.. మన భవిష్యత్తు కోసం.. మన ఓటు మనం వేసుకుందామన్నారు. నాకు ఓటు వేస్తే మోడీకి ఓటు వేసినట్లే అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మంచి ఆసుపత్రి, కళాశాలలను నిర్మించి, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. గ్రామ, గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ గడ్డ బిడ్డను.. ఇక్కడే పుట్టి పెరిగా అందుకే ఖమ్మం సమగ్ర అభివృద్ధికి కోసం కృషి చేస్తా అని హామీ ఇచ్చారు. మన సమస్యలు మనకు తెలుస్తాయి.. ఎక్కడి నుంచో వచ్చిన వారికి ఎలా తెలుస్తాయన్నారు. ఓబీసీ నుంచి వచ్చిన ప్రధాన మంత్రి మోడీ రిజర్వేషన్లు రద్దు చేస్తారని అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని వినోద రావు కోరారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే బిజెపి ధ్యేయమన్నారు. మీలో ఒకడిని.. 16, 18 గంటలు కష్టపడి మీ కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు. కమలం గుర్తు కు ఓటు వేసి నన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఉద్దేశించి వినోద రావు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు బట్టు నాగరాజు, జనరల్ సెక్రటరీ లంకపల్లి సాగర్, జిల్లా కార్యదర్శి నున్న రవి కిరణ్. ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోటపర్తి సుదర్శన్, పార్టీ జిల్లా కార్యదర్శి నకరికంటి వీరభద్రం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కళ్లెం విజయ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, మండల నాయకులు పాల్గొన్నారు.



# దత్త పుత్రుల కోసమే మోడీ పాలన

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్రెడ్డిని అరెస్టు చేస్తే బిజెపికి పుట్టగతులు ఉండవన్నారు. తమకు ఇష్టమైన వారు ఏ తప్పు చేసిన బిజెపి మాట్లాడదని జగన్ లక్షల కోట్లు దోచుకుని పదేళ్లుగా బెయిల్ పై ఉన్న బిజెపికి దత్త పుత్రుడు కాబట్టి పట్టించుకోవడం లేదన్నారు. నామ నాగేశ్వరరావు అమాయకుడని కేసిఆర్ మాయలో పడ్డారని నారాయణ తెలిపారు. కేసిఆర్ మాటలు ఇప్పుడు జనం నమ్మె పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్కు కాలం చెల్లిందని తెలిపిన నారాయణ ఉత్తరాదిన బిజెపికి సీట్లు తగ్గుతున్నాయని అధికారంలోకి రావడం కల్లేనన్నారు. యేటా రెండు కోట్ల చొప్పున 20 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సిన బిజెపి ఆ పని చేయలేదని ఆర్థిక మంత్రి ప్రకటన ప్రకారం 1.75 కోట్ల ఉద్యోగాలకు అవకాశం కల్పించారన్నారు.కానీ అందులో వాస్తవం లేదన్నారు. పబ్లిక్ సెక్టార్ను విక్రయిస్తూ కోట్లాది ఉద్యోగాలను ఊడగొడుతున్నారని నారాయణ తెలిపారు. 29 మంది రూ. 14 లక్షల కోట్లు ఎగవేస్తే అందులో 25 మంది గుజరాతీయులేనని ఆయన ఆరోపించారు. సామాన్యులు వినియోగించే చెప్పుల పైన పన్నును ఐదు నుంచి 18 శాతం పెంచిన బిజెపి కార్పొరేట్ పన్నును మాత్రం 33 నుంచి 27 శాతానికి తగ్గించిందన్నారు. లక్షల కోట్లు ఎగవేసిన 29 మందిలో ఒక్క ముస్లింమైన ఉన్నారా అని నారాయణ ప్రశ్నించారు. బిఆర్ఎస్ఈ ఊగిసలాటని బిజెపిది భయాందోళన అని ఒక్క ఓటుతో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని నారాయణ పిలుపునిచ్చారు.

## ఎర్ర జెండాలే నాకు స్ఫూర్తి : తుమ్మల



ఎర్రజెండాల స్ఫూర్తితోనే రాజకీయాలు ప్రారంభించానని ఆ స్ఫూర్తితోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ సిపిఐ, సిపిఎంతో నాది సుదీర్ఘ రాజకీయ ప్రయాణమని జాతీయ రాజకీయాల దృష్ట్యా అప్పుడప్పుడు కాస్త దూరమైనా కమ్యూనిస్టులతో చెలిమి మాత్రం కొనసాగుతుందని తుమ్మల తెలిపారు. ఖమ్మంజిల్లాలో ఎర్రజెండాల రెప రెపల వెనక అనేక మంది త్యాగాలు ఉన్నాయని బడుగు, బలహీన వర్గాల కోసం ఆస్తులను అమ్మి కమ్యూనిస్టులు సేవ చేశారన్నారు. రజక్అలాంటి వ్యక్తుల సేవతో పేదల గుండెల్లో ఎర్రజెండా నిలిచిపోయిందని కమ్యూనిస్టులు కలిసి ఉన్న లేకున్నా జిల్లా అభివృద్ధిని మాత్రం ఆపలేదన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, మంచినీరు కోసమే ఎర్ర జెండా పోరాటం చేసిందని ఇప్పుడా బాధ్యతను తాను తీసుకుని పేదల కోసం ఈ అధికారాన్ని ఉపయోగపెడతామన్నారు. ఇండియా కూటమిలో సిపిఐ, సిపిఎంలు కలిసి పని చేస్తున్నాయని ఖమ్మంజిల్లాలో కూటమి ఘన విజయం సాధిస్తుందని మతతత్వ బిజెపిని ఓడించేందుకు కలిసి రావాలని ప్రతి ఓటు చేతి గుర్తుకు వేసేలా కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గోదావరి జలాలతో ఖమ్మంజిల్లా సస్యశ్యామలం కావాలంటే పెద్ద మెజార్టీతో పార్లమెంటు అభ్యర్థిని గెలిపించాలన్నారు. తుమ్మల కాంగ్రెస్ వామపక్షాల ఐక్యత వర్ధిలాలి అంటూ నినదించారు.

## పొత్తు పరోక్షం కాదు ప్రత్యక్షమే : పొంగులేటి



బిజెపితో బిఆర్ఎస్ పొత్తు పరోక్షం కాదు ప్రత్యక్షమేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. కేసిఆర్ మాటలు దీనిని రుజువు చేస్తున్నాయని కేంద్రంలో నామ మంత్రి అవుతారంటే బిజెపితో పొత్తు లేకుండా ఎలా సాధ్యమని పొంగులేటి ప్రశ్నించారు. సిపిఐ పార్లమెంటరీ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ మార్పు కోసం శాసనసభ ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్ కలిసి పనిచేసి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నామని అదే రీతిలో కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం కోసం మరోమారు కలిసి పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని కమ్యూనిస్టులు ఏమి కోరుకుంటున్నారో కాంగ్రెస్కు అధికారం వస్తే అదే చేస్తుందని పొంగులేటి తెలిపారు. దేశ భవితవ్యాన్ని విదేశాలకు తాకట్టు పెడుతున్న బిజెపి రామున్ని రాజకీయాల్లోకి తీసుకు వచ్చిందని మనకు అక్షింతలు ఇచ్చి అధికారాన్ని కొట్టేయాలని ప్రయత్నిస్తుందని పొంగులేటి తెలిపారు. బిజెపిని ఓడించక పోతే దేశానికి ప్రమాదమన్నారు. ఇక 2019లో సారు కారు పదహారు అంటూ కేసిఆర్ ప్రచారానికి తెలంగాణ ప్రజలు కర్రుకాచి వాతపెట్టారని ఇప్పుడు మరోసారి వాతలు తప్పవన్నారు. రూ.1.50 లక్షల కోట్లు దోచుకుని దాని నుంచి బయటపడేందుకు రాత్రిపూట చర్చలు జరుపుతున్నారని బిఆర్ఎస్ ను పొంగులేటి విమర్శించారు. అక్రమాలు బయటపడుతున్నాయని విద్యుత్ శాఖ, నీటిపారుదల, ధరణి ద్వారా దోచుకున్న సొమ్ము బయటపడక తప్పదన్నారు. తెలంగాణలో 17కు 17 స్థానాలు సెక్యూలర్ కూటమి గెలుస్తుందని బిఆర్ఎస్, బిజెపిలను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు.

## ఉద్యమ ఖిల్లాలో కూటమికి ఎదురు లేదు : కూనంనేని

ఉమ్యమ ఖిల్లాలో ఇండియా కూటమికి ఎదురు లేదని అపూర్వ విజయాన్ని సొంతం చేసుకుంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఖమ్మం జిల్లా అంటే కమ్యూనిస్టుల కంచుకోట అని ఆయన తెలిపారు. జాతీయ రాజకీయాల దృష్ట్యా కాంగ్రెస్ను బలపరుస్తున్నామని దేశం కోసం కమ్యూనిస్టులు అనేక త్యాగాలు చేశారని ఈ పొత్తు కూడా త్యాగం లాంటిదేనన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా బిజెపిని ఓడించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కమ్యూనిస్టులకు మోసం, దగా తెలియదని కూనంనేని తెలిపారు. మోడీ ఏ ప్రధాన మంత్రి మాట్లాడని విధంగా నికృష్టంగా మాట్లాడుతున్నారని ఆయనకు రాజ్యాంగంపై గౌరవం లేదన్నారు. హిందువుల మధ్య కూడా ఘర్షణలు జరిగిన చరిత్రలు ఉన్నాయి కానీ స్వాతంత్ర్య అనంతరం హిందు, ముస్లింల మధ్య ఘర్షణ జరగలేదని ఆయన తెలిపారు. బిజెపిలో భయం మొదలైందని అందుకే ముస్లింలపై, క్రిస్టియన్లపై దాడులకు తెగబడుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ నేను పక్కా లోకల్ అని మా నాన్నది చేగొమ్మ గ్రామమని నేను ఖమ్మంలో నామ నాగేశ్వరరావు ఇంటి పక్కనే ఉంటానని మా అత్తగారిది పిండిప్రోలు అని ఆయన తెలిపారు.

## బిజెపికి ఓటు వేస్తే రూ. 65 పెట్రోలు

రూ.110, రూ.400 గ్యాస్ రూ.1100లకు పెరిగిందన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేని బిజెపి ఇప్పుడు రాముని నినాదాన్ని అందుకుందన్నారు. సెక్యూలర్ శక్తులను బలపర్చి తనకు ఓటువేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో సిపిఐ ఖమ్మంజిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, రాష్ట్రనాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్రెడ్డి, యర్రా బాబు. ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు,సిద్దినేని కర్ణకుమార్, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# మైక్రో అబ్జర్వర్ల విధివిధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన - డా. సంజయ్ జి కోల్టే

ఖమ్మం ప్రతినిధి, మే 2, ప్రజా జ్యోతి:






ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు, జనరల్ అబ్జర్వర్ కి కళ్ళు, చెవులు లాంటి వారని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు డా. సంజయ్ జి కోల్టే అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణా కార్యక్రమానికి జనరల్ అబ్జర్వర్లు హాజరై, వారికి విధులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ, పోలింగ్ రోజున మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలక మన్నారు. ఒకే లోకేషన్ లో ఒకటి కన్న ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న చోట మైక్రో అబ్జర్వర్ల నియామకం చేశామన్నారు. ఈ నెల 12న పోలింగ్ కు ఒక రోజు ముందు మైక్రో అబ్జర్వర్లు వారి వారి నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఉదయం 8.00 గంటలకు రిపోర్ట్ చేయాలని, అక్కడి నుండి పోలింగ్ సిబ్బందితో పాటు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలని అన్నారు. పోలింగ్ పిదప పార్లమెంట్ నియోజకవర్గ మొత్తానికి ఒకేచోట శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన రిసిప్షన్ కేంద్రంలో నివేదికలు సమర్పించాలన్నారు. జనరల్ అబ్జర్వర్ పర్యవేక్షణ లో విధులు నిర్వర్తించాలన్నారు.పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. కనీస మౌళిక సదుపాయాల కల్పన ఉన్నది చూడాలన్నారు. మాక్పోల్ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు.

ముఖ్య విషయాలన్నీ నమోదు చేసుకోవా లన్నారు. నివేదికను ఫారం-28లో పొందు పర్చాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఎవరెవరు ప్రవేశిస్తుంది గమనించాలన్నారు. ఎంతమంది రాజకీయ పార్టీల ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో ఉన్నది చూడాలన్నారు. ఓటింగ్ కంపార్ట్ మెంట్ సీక్రెసి ఆఫ్ ఓటింగ్ కు అనుగుణంగా ఏర్పాటుచేసింది చూడాలన్నారు. ఇండిలిబుల్ ఇంక్ సరిగా చేస్తున్నది పరిశీలించాలన్నారు. అప్రమత్తంగా వుంటూ, తమ విధులు సమర్థవంతంగా చేపట్టాలన్నారు.కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారిణి, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కె. శ్రీరామ్, మదన్ గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కంకణబద్ధులై పని చేయాలి.. నామా నాగేశ్వరరావు

**-ఈ ఎన్నికల్లో చరిత్ర తిరగరాయబోతున్నాం**

**-కాంగ్రెస్ మోసంతో ప్రజలు ఆలోచనలో పడ్డారు -గడప గడప కు వెళ్లి ప్రజలతో మమేకం కావాలి**

**-కార్యకర్తలే కధానాయకులు**

**-ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఖమ్మం టూ టౌన్ ఏరియా కార్యకర్తల సమావేశంలో బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర**





ఖమ్మం, మే 2, ప్రజాజ్యోతి:

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని ఆ మోసపు మాటలు నమ్మిన ప్రజల్లో మార్పు వచ్చిందని నామ నాగేశ్వరరావు అన్నారు. ప్రతి కార్యకర్త కంకణబద్ధులై గడప గడపకు వెళ్లి తలుపు తట్టి ప్రజలతో ఏకమై మంచి మెజార్టీతో గెలిపించాలని బీఆర్ ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా. కార్యాలయంలో గురువారం జరిగిన ఖమ్మం టూ టౌన్ ఏరియా పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమయం తక్కువుగా ఉన్నందున అందరం కష్టపడి పని చేద్దామని చెప్పారు.జిల్లాలో కేసీఆర్ సభలు సక్సెస్ అయ్యాయని, ప్రజలు ఆలోచనలో పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ చేసిన మోసంపై ప్రజల్లో విస్తృత చర్చ నడుస్తోందని పేర్కొన్నారు.మంచి వాతావరణం ఉందని, బూత్ స్థాయిలో రాత్రిబవళ్ళు కష్టపడి పని చేయాలన్నారు. కార్యకర్తలే కదానాయకులని కష్టించి పని చేస్తే టూ టౌన్ లో మంచి మెజార్టీ ఖాయమన్నారు.పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ...నామ నాగేశ్వరరావు మంచి మెజార్టీతో గెలవబోతున్నారని చెప్పారు. 13 న జరిగే ఎన్నికల్లో చరిత్ర తిరగరాయబోతున్నామని చెప్పారు.కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గ్రహించి, ఆలోచనలో పడ్డారని, వారిని వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో కలిసి ఓట్లు రాబట్టాలని అన్నారు ప్రజలు,కార్యకర్తల వల్లే నాయకులకు పదవులని అన్నారు పార్టీ ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకుని, ప్రజల్లో ఎదగాలన్నారు . రాష్ట్రంలో 12 ఎంపీ సీట్లను గెలవబోతున్నట్లు పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కేసీఆర్ సభలకు వచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్ కు వణుకు పుట్టిందన్నారు. అన్ని వర్గాల్లో కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ప్రతి ఇంటికి వెళ్లి వారిని కదిలించాలని అన్నారు. ప్రజలే అంతిమంగా న్యాయ నిర్ణేతలని, వారితో కలిసి పని చేస్తే నామ మంచి మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు.రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ....రాష్ట్ర, జిల్లా ప్రయోజనాలు నెరవేరాలన్నా నామ నాగేశ్వరరావు గెలుపు తప్పనిసరన్నారు. నామ గెలిస్తే ఇక్కడే ప్రజల మధ్య ఉంటారని, కానీ ఆ పార్టీ అభ్యర్థి ఎక్కడుంటారో తెలియని దుస్థితి నెలకొందన్నారు.ఈసీ ద్వారా కేసీఆర్ కు నోటీస్ ఇప్పించి, కావాలనే ఆయన్ని 48 గంటల పాటు మాట్లాడకుండా నిర్బంధం చేసారని పేర్కొన్నారు. బీసీ కి రెండోసారి రాజ్యసభ ఇచ్చి గౌరవించిన కేసీఆర్ రుణాన్ని బీసీలంతా తీర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం , బుర్రి వెంకట్, పొన్నం వెంకటేశ్వర్లు,వెంకటరమణ , మోతారపు సుధాకర్, దోరేపల్లి శ్వేత, పగడాల శ్రీదేవి ,వినయ్ , పార్థసారధి, తాజుద్దీన్ , తదితరులు పాల్గొన్నారు.

# టి యు డబ్ల్యు జే(ఐ జే యు)కన్వీనర్‌గా ఎన్నికైన తేళ్ల శ్రీనివాసరావు



కారేపల్లి,మే 2, ప్రజాజ్యోతి:

టి యు డబ్ల్యూ జే (ఐజేయు)సింగరేణి మండల కన్వీనర్గా తేళ్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం సింగరేణి మండల కేంద్రంలోని జిల్లా నాయకులు తాతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన టియుడబ్ల్యూజే (ఐజేయు) ముఖ్య సభ్యుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండల కన్వీనర్ గా తేళ్ళ శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు తాతా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం కారేపల్లిలో టియుడబ్ల్యూజే (ఐజేయు) వైరా నియోజకవర్గస్థాయి సెమినార్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.జూన్ నెలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని,ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు,రాజ్యసభ సభ్యులు,యూనియన్ రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. అనంతరం మండల కన్వీనర్ గా ఎన్నికైన తేళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ... తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని,జర్నలిస్టుల సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తనను కన్వీనర్ గా ఎన్నుకున్న జిల్లా నాయకులు తాతా శ్రీనివాసరావుకు,యూనియన్ సభ్యులకు ఈ సందర్భంగా తేళ్ల కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సీనియర్ జర్నలిస్ట్ కొండపల్లి వెంకటేశ్వర్లు,ఏపూరి లక్ష్మీనారాయణ,కొత్తూరు శ్రీనివాస్,ముక్క వెంకటేశ్వర్లు,చిన్ని ప్రవీణ్ కుమార్,జంగ నరేష్,కేతిమల్ల సురేష్ పాల్గొన్నారు.

# జూపల్లి సుప్రజకు కలెక్టర్ గౌతం ప్రశంస



కారేపల్లి,మే 2, ప్రజాజ్యోతి:

పదవ తరగతి ఫలితాలలో మండల టాపర్ గా నిలిచిన జూపల్లి సుప్రజకు ఖమ్మం జిల్లా కలెక్టర్ విపి.గౌతం చేతుల మీదుగా ఘనంగా సన్మానించి,మేమంటో అందజేశారు. సింగరేణి ఆదర్శ పాఠశాల పదవ తరగతి విద్యార్థిని సుప్రజ పదవ తరగతిలో పది జీపీఏ మార్కులతో మండల టాపర్గా నిలవడంతో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ గౌతం సుప్రజను అభినందించి,శాలువా కప్పి సన్మానించారు. నీవు చూపిన కృషి,పట్టుదలే నిన్ను ఇంతటి స్థానంలో నిలబెట్టిందని భావితరాలకు నువ్వు ఆదర్శమని అన్నారు.ఉన్నత విద్యలో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు,గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని తెలిపి,పాఠశాల ప్రిన్సిపల్ అక్తర్, అధ్యాపక బృందాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో డిఈఓ సోమశేఖర శర్మ,క్లాస్ టీచర్ జానకి రాములు,తండ్రి లాలయ్య-తల్లి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సొంతగూటికి చేరుకున్న యువజన నాయకుడు పారా ఉదయ్ కిరణ్

ఖమ్మం, మే 2, ప్రజా జ్యోతి:



గత అసంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని వీడి పార్టీలో చేరిన యువజన నాయకుడు పారా ఉదయ్ కిరణ్ తన పారా ఫ్యామిలీ మొత్తం పార్టీలో ఉండటంతో నాపై ఒత్తిడి పెరిగి తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ ను ఆనాడు వీడాల్సి వచ్చింది అని అన్నారు. తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రధానంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీల హామీలు అమలుచేసే విధానంకు ప్రజల ఆదరణ పెరుగుతుందని, ముక్యంగా రైతులకు 2 లక్షల రుణమాఫీ వచ్చే ఆగస్టు 15 లోపు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి రైతుకు 2లక్షల రుణమాఫీ చేయబోతోంది.

రేవంత్ రెడ్డి నాయ కత్వంలో పదేండ్లుగా ఎదురు చూస్తున్న రైతు కల తీరబోతుందని ఇలాంటి కాంగ్రెస్‌పార్టీలో పాలేరు నియోజకవర్గ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మరియు సమాచారాల శాఖా మాత్యులు శ్రీ పొంగు లేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబ్యర్థి రఘురాం రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు పనిచేస్తానని అన్నారు.

# ఓటు వేస్తే ఉచిత వైద్యం

## శ్రీ రక్షా హాస్పిటల్ , వినూత్న ప్రయత్నం

ఖమ్మం, మే 2, ప్రజాజ్యోతి:



13న పార్లమెంట్ ఎన్నికలు , 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని శ్రీ రక్షా హాస్పిటల్ ఖమ్మం వారు ఓటు వేస్తే ఉచిత వైద్యం అనే ఆఫర్ ద్వారా వినూత్న ప్రయోగం చేసింది ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలపడానికి , ఓటు మీ వజ్రాయుధమని. ఎన్నికల్లో ఓటింగ్ ను ప్రోత్సహించడానికి ఓటు వేస్తే ఉచిత వైద్యం అని ఆఫర్ ప్రయోగం చేసిందన్నారు. ఓటు వేసిన వారికి రెండు నెలల పాటు శ్రీరక్షా హాస్పిటల్లో డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమని, మరియు వెట్రీట్ ద్వారా ఒక సంవత్సరం పాటు ఉచిత తెలిమెడిసిన్ ద్వారా వైద్యం అందించబడునని కావున అందరూ ఓటు హక్కును వినియోగించుకొని ఉచిత వైద్య సేవలు పొందాలని శ్రీ రక్షా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు , హాస్పిటల్ డాక్టర్లు మానస , షేక్ ఏడుకొండలు , సతీష్ , గార్లపాటి వెంకటేశ్వర్లు , కాశీ విశ్వనాథం , తేజ్ కుమార్ , అల్తాఫ్ మరియు వైద్య బృందం వివరించడం జరిగింది.

---

## ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు

# అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు

కారేపల్లి, ఏప్రిల్ 2, ప్రజాజ్యోతి



వేసవికాలం దృష్ట్యా ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది వేసవికాలంలో ఎండలు విపరీతంగా ఉంటాయని వాతావరణ శాఖ అంచనా నిజమైంది. తీవ్రమైన ఎండ దానికి తోడు రెండు మూడు రోజుల నుంచి వడగాలువు రావడంతో మండలంలో ప్రజలు ఉక్కిరిబిక్కిరికి గురవుతున్నారు. ఉదయం 10 గంటలకి భానుడు తన ప్రతాపాన్ని చూపడం ప్రారంభిస్తున్నాడు. సాయంత్రం 6 దాటిన ఎండ వేడి తగ్గడం లేదు. ఈ క్రమంలో మండల కేంద్రానికి వివిధ పనుల పై వచ్చే ప్రజలు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవికాలం దృష్ట్యా చల్లని నిరు తాగేందుకు ప్రజలు ఇష్టం చూపడంతో కుండలకు సైతం గిరాకీ విపరీతంగా పెరిగిపోయింది. ఇక కూలర్ల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ధరలు అమాంతంగా పెరిగిపోయాయి.

### అప్రమత్తత అవసరం - వైద్యాధికారి సురేష్

విపరీతమైన ఎండలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వైద్యాధికారిబి.సురేష్ గురువారం విలేకరులతో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరి పరిస్థితులలో తప్ప ఎండలో తిరగడం నిషేధించుకోవాలన్నారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవడం, మజ్జిగ, నిమ్మరసం లాంటి ద్రవపదార్థాలు తీసుకోవడంతో శరీరంలో వేడి శాతాన్ని తగ్గించి ఎండ బారిన పడకుండా తప్పించుకోవచ్చు అన్నారు. గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సైతం ప్రజలకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎండలకు తిరిగే వ్యక్తులు శరీరంపై వదులుగా ఉండే దుస్తులు ధరించాలని, కాటన్ దుస్తులు ధరించడం మేలైన అంశమని అన్నారు.

ఎండ వేడిమితో పాటు వడగాలులతో అధిక ప్రమాదం ఉంటుందని బయటకు వెళ్లేటప్పుడు తలపై క్యాపు ధరించడం, ముఖానికి రుమాలు లాంటివి కట్టుకోవాలని అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తి జ్వరము వాంతులు విరోచనాలు లాంటి లక్షణాలు ఉంటాయని ఎండకు తిరిగిన వ్యక్తికి ఇటువంటి లక్షణాలు ఏమైనా గుర్తిస్తే వడదెబ్బగా పరిగణించాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశంలో తీసుకొని వెళ్లి బాగా గాలి వచ్చే విధంగా చూసుకొని శరీరాన్ని చల్లటి గుడ్డతో తుడవాలన్నారు. ప్రధానంగా శరీరంలో వేడి ఉష్ణోగ్రత తగ్గే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దగ్గరలోని వైద్యశాలకు వ్యక్తిని తీసుకుని వెళ్లాలన్నారు.

---

## విజయలక్ష్మి చిత్ర పటానికి తాండ్ర వినోదరావు ఘన నివాళి

బోనకల్,మే 2,ప్రజాజ్యోతి:

మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం మాజీ మధిర మార్కెట్ చైర్మన్ బంధం శ్రీనివాసరావు సతీమణి విజయలక్ష్మి దశ దిన కార్యక్రమంలో ఖమ్మం భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు పాల్గొని విజయలక్ష్మి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీ బోళ్ళ భిక్షపతి,బోయినపల్లి పటేల్,చింతకాని బిజెపి నాయకులు కొండ గోపి, మద్దినేని వెంకటేశ్వర్లు, పండగ సీతారాములు యాదవ్, దొడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుడికి కన్నీటి వీడ్కోలు

చింతకాని మే 2, ప్రజాజ్యోతి:

నాగులవంచ గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు స్వతంత్ర సమరయోధులు అంబటి వెంకటయ్య గారి పార్థివదేవాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి దుర్గాప్రసాద్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎస్కే జావిద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సౌజన్య మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కంభం వీరభద్రం మండల కాంగ్రెస్ నాయకులు కూరపాటి కిషోర్ కిలారి మనోహర్ ఆలస్యం బసవయ్య వెచ్చ మంగయ్య వైరు వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించినారు వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగడ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేసినారు

## కెసిఆర్ ను కలిసిన మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు

కారేపల్లి, మే2, ప్రజాజ్యోతి:



తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమ నాయకుడు జూపల్లి రాము మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం వచ్చిన కేసీఆర్ ను గెస్ట్ హౌస్ లో కలిసి జూపల్లి రాము పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో జూపల్లి రాము సింగరేణి మండలంలో ప్రధాన భూమిక పోషించారు. కెసిఆర్ పిలుపుమేరకు అనేక సందర్భాలలో ఉద్యమాల్లో పాల్గొన్నారు. కెసిఆర్ పైన ఉన్న అభిమానంతో అప్పట్లో తలపైన కెసిఆర్ అనే అక్షరాలను చెక్కించుకున్నారు. ఉద్యమ సారధిని కలవడం పట్ల జూపల్లి రాము సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టిఆర్ఎస్ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలవబోతుందని ఈ విషయం కెసిఆర్ బస్సు యాత్రను చూస్తే అర్థమవుతుందని రాము పేర్కొన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆలయంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి పూజలు

ఖమ్మం, మే 2, ప్రజాజ్యోతి:



నగరంలోని గాంధీ చౌక్ ప్రాంతంలోని కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయాన్ని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేదాశీర్వాదం పొందారు. అనంతరం ఆర్యవైశ్య సమ్మేళనం లో మాట్లాడారు. అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యాపార రంగానికి అండగా ఉంటామని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణ కుమారీ, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, నగర అధ్యక్షులు మహ్మద్ జావేద్, మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు కొప్పుల చంద్ర శేఖర్, ఆలయ నిర్వాహకులు మేళ్ళ చెర్వు వెంకటేశ్వర రావు, గోళ్ల భాస్కర్ రావు, బీసీసి. రావు, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## నామాను కలిసిన నందమూరి అభిమానులు

ఖమ్మం, మే 2 ప్రజాజ్యోతి:



ఖమ్మం బి.ఆర్.ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసిన నందమూరి అభిమానులు. నామగెలుపు లక్ష్యం గా ఆయన కోసం పనిచేస్తాం అని వారు అన్నా రు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ, ఈరోజు నామ నాగేశ్వరరావుకి అన్న నందమూరి తారకరామారావు ప్రతిమను బహుకరించారు. పార్లమెంట్లో అన్న నందమూరి తారకరామా రావు విగ్రహాన్ని పెట్టే విషయం లో నామ కృషి ఎప్పటికి మరువలేనిదిఅని వారు గుర్తుచేసు కున్నారు. ఇప్పటికి నామ నందమూ రి బాలకృష్ణ తో పాటు బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ కి డైరెక్టర్ గా ఉన్నారు అని పేరుకొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనివాస్, నల్లమల్ల రంజిత్, సతీష్, రంగారావు, శేఖర్ పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో తెలంగాణ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



ఖమ్మం ఎడ్యుకేషన్, మే 2, ప్రజాజ్యోతి: పదవ తరగతి ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు తమ సత్తాను చాటారు. ఈ ఫలితాలలో 557 మంది విద్యార్థులు అత్యధికంగా 10/10 జిపిఏ ను సాధించారు. 1147 మంది విద్యార్థులు 9.8 జీపీఏను, 1702 విద్యార్థులు 9.7 జిపిఏను సాధించారు. మొత్తం విద్యార్థుల సరాసరి 9.0 జిపిఏ ను సాధించారు. ఏ వన్ గ్రేడ్ సాధించిన విద్యార్థులు గణితములో 3845, సామాన్య శాస్త్రంలో 4099,సాంఘిక శాస్త్రంలో 4351 మరియు లాంగ్వేజెస్ లో 11669 మంది కాగా సబ్జెక్ట్ వారీగా మొత్తం ఏ గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 14,283 మంది, ఈ ఫలితాలలో ఖమ్మం జోన్ లోని శ్రీ చైతన్య స్కూల్స్ విద్యార్థులు 84,వరంగల్ జోన్ లో 94,కరీంనగర్ ఆదిలాబాద్ జోన్ లోని 112,నిజామాబాద్, మెదక్ జోన్ లో 98,మహబూబ్నగర్, నల్లగొండ జోన్ లో 147,వికారాబాద్ జోన్లో 22 మంది 10 జీపీఏ ను సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత శ్రీ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ...మా విద్యార్థులు ఐఐటి, మెడికల్ కోచింగ్ తో పాటు స్టేట్ సిలబస్ లో కూడా అత్యున్నత ప్రతిభ కనబరిచారని వారు తెలిపారు. తెలంగాణ శ్రీ చైతన్య విద్యా సంస్థలు చక్కటి బోధన కరిక్యులం షెడ్యూల్ కచ్చితంగా అనుసరించడం వలన ఇంతటి ఫలితాలు సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీమతి శ్రీవిద్య మాట్లాడుతూ....ఎన్ టి ఎస్ ఎఫ్, ఐఓయూఎం, జెఇఎస్ఓ, నాసా, ఐ ఎన్ టి ఎస్ ఓ, క్యాట్ వంటి ఏ ఒలంపియాడ్ పోటీ పరీక్షల కైనా శ్రీ చైతన్య విద్యార్థులే ముందు ఉంటారని తెలిపారు. సి- ఐపీఎల్, సి- ఎం పి ఎల్, సి- బ్యాచ్ మరియు టెక్నో కార్యక్రమంలో జాతీయ అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, అన్ని పోటీపరీక్షలలోనూ విజయాలు సాధిస్తూ, పదవ తరగతి ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ప్రిన్సిపాల్ మరియు ఆధ్యాపక బృందం అభినందించారు. ఈ ఫలితాల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తమ హర్షం వ్యక్తం చేశారు.

# తుమ్మల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

ఖమ్మం, మే 2, ప్రజాజ్యోతి:

ఈరోజు సాయంత్రం 04,47,53,54 డివిజన్ల లోని బీఆర్ఎస్ నాయకులు ఈరోజు వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది, చేరిన వారిలో మాజీ కౌన్సిలర్ కిలారు బాబ్జి,మేదరమట్ల స్వరూప రాణి, బుడిగా అనసూయ,ఎలినేని రమణ, ఒంటి కొమ్ము శ్రీనివాసరెడ్డి,కంచర్ల దయాకర్,మరియు మైనార్టీ నాయకులు ఐద్రుల్ల,యాకుబ్ బాబా తదితర ముఖ్య నాయకులు పార్టీలో జాయిన్ అయ్యారు. అదేవిధంగా రఘునాధపాలెం మండలానికి చెందిన వి ఆర్ బంజర రాంక్య తండా బిఆర్ఎస్ నాయకులు 20 కుటుంబాలు కాంగ్రెస్ నాయకులు కొండలు, రమణ,రాములు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వరావు సమక్షంలో పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది.. మరియు రాంఖ్యాతండా లో ఎంపీటీసీ వెంకన్న ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నంద నాయక్ మరియు 50 కుటుంబాలు టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు మిక్కిలినేని నరేంద్ర, అబ్దుల్ రషీద్,చావ నారాయణరావు, రావూరి సైదుబాబు,జాకీర్,బచ్చు కమలాకర్, కార్పొరేటర్ కమర్తపు మురళి, గుత్తావెంకటేశ్వరరావు,మలిదు జగన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలపై నామా సెటైర్లు

## -రాష్ట్రంలో కరెంటు కోతలపై ఘాటుగా స్పందించిన నామ

ఖమ్మం, మే 2, ప్రజా జ్యోతి:

తెలంగాణ రాష్ట్రంలో కరెంటు కోతలు మరియు నీటి కొరతపై ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన విషయాన్ని ప్రస్తావించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలను బట్టి విక్రమార్క ఖండించి, ఇది అసత్య ప్రచారమని తప్పుని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు.అదేవిధంగా ఓయూలో కరెంటు కోతలు నీటి కష్టాలపై ప్రభుత్వానికి లేఖ రాసిన ఉద్యోగుల కు నోటీసులు ఇవ్వడం అందరికీ తెలిసిన విషయమే, ఆ మరుసటి రోజే ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ప్రెస్ మీట్ పెట్టి మరి బట్టి విక్రమార్క ను కరెంటు కోతలు నీటి కష్టాలు, ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నాయని కెసిఆర్ అన్న మాటలు అబద్ధమని మీరు నిరూపిస్తే మేము దేనికైనా సిద్ధమని కావాలంటే మీరే స్వయంగా వచ్చి ఇక్కడ పరిస్థితిని చూడవలసిందిగా వారు కోరారు. ఇదిలా ఉంటే ఖమ్మం నగరంలో బుధవారం అర్ధరాత్రి ప్రజలంతా ప్రశాంతంగా నిద్రించేసమయంలో ఒంటిగంట నుండి ఒకగంటపాటు నిరంతరాయంగా కరెంటు కోత పెట్టడం నిజంకాదా అని, మరలా మరుసటి రోజు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి సుమారు గంటన్నర పాటు కరెంటు కోత విధించడం నిజంకాదా అని, ప్రస్తుతం రాష్ట్రంలో 45,46 డిగ్రీల ఎండ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ప్రజలు ఎండల తీవ్రతకు వడదెబ్బన పడి ఇబ్బంది పడుతున్నారన్నారు. నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

## అదనపు ఈవీఎంల ఫస్ట్ లెవెల్

# తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి, మే 2, ప్రజాజ్యోతి :



పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అదనపు ఇవిఎం ల ఫస్ట్ లెవల్ తనిఖీని గురువారం ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ పరిశీలించారు. నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం, వివిప్యాట్ల గోడౌన్ లో చేపట్టిన అదనపు ఇవిఎం ల ఫస్ట్ లెవల్ తనిఖీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం పార్లమెంట్



నియోజకవర్గ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు, నోటా తో కలిపి 36 అవుతున్నారని అన్నారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్లో 16 మంది అభ్యర్థులకు అవకాశం ఉన్నందున, ఎన్నికల నిర్వహణకు 3 బ్యాలెట్ యూనిట్ ల అవసరం ఉందన్నారు. ఇందుకై అదనపు ఇవిఎంలను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇవిఎం గోడౌన్ లో ఉన్న వైరా అసెంబ్లీ సెగ్మెంట్ కు చెందిన 252 బ్యాలెట్ యూనిట్లు, 252 కంట్రోల్ యూనిట్లు, అదనంగా కేటాయించిన 2200 బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ తనిఖీలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం నుండి చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఖమ్మంకు రాహుల్ గాంధీ

## -ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో..బహిరంగ సభ



ఖమ్మం ప్రతినిధి, మే 2, ప్రజాజ్యోతి: ఏఐసిసి అగ్రనేత, ఎంపీరాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రం పర్యటన ఖరారైంది. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రాష్ట్రం లో పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. అందుకు సంబంధించిన ప్రకటన తేది ఖరారైంది. తెలంగాణ లో పార్లమెంట్ ఎన్నికల రాజకీయం రస వత్తరంగా మారింది. అభ్యర్థులతో పాటు కీలక నేతల ప్రచారాలతో రాజకీయ కాక రేగుతోంది.ప్రధాన పార్టీల నుంచి కీలక నేతలు రంగంలోకి దిగడం తో విమర్శలు, ప్రతివిమ ర్శలతో రాష్ట్రం వేడెక్కింది. ముఖ్యంగా జాతీయ పార్టీల నేతలు రాష్ట్రానికి వస్తుండ టంతో ప్రచారం మరింత ఊపందుకుంది.ఇప్పటికే మోదీ, అమిత్ షా, నడ్డా బీజేపీ తరపున ప్రచా రం చేశారు. ఇక కాంగ్రెస్ నుంచి కూడా జాతీయ నేతలు రంగంలోకి దిగుతున్నారు.ఇందులో భాగంగానే లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల రాష్ట్ర పర్యటన ఖరారైనట్లు పీసీసీ వర్గాలు వెల్లడిం చాయి.ఈనెల 5వ తేదీన రాహుల్ గాంధీ నిర్మల్, గద్వాల్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థు లకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారని ఈనెల 9వ తేదీన ఖమ్మం, కరీంనగ ర్, సరూర్ నగర్, ప్రచారం చేయనున్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో ప్రియాంక గాంధీ రాష్ట్రానికి రానున్నారు. 6వ తేదీన ఎల్లారెడ్డి, తాండూర్, సికింద్రాబాద్ ఎన్నికల ప్రచార సభలకు, 7వ తేదీన నర్సాపూర్, కూకట్పల్లిలో ప్రియాంక ప్రచారం చేయనున్నారు.

# మలబద్ధకం ప్రాణాంతం కావొచ్చు తస్మాత్ జాగ్రత్త

## -ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఎమ్. మణిశేఖరన్

## -మలద్వారం బైటికి చొచ్చుకొచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడిన యశోదా ఆసుపత్రి వైద్యబృందం

ఖమ్మం, మే 2, ప్రజాజ్యోతి:

నగరంలో స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ మలక్ పేట్ హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ డాక్టర్ ఎమ్. మణిశేఖరన్ మాట్లాడుతూ తీవ్రమైన మరియు దీర్ఘకాలిక మలబద్ధకం మల ద్వారానికి సంబంధించిన అనేక రకాలైన తీవ్రమైన సమస్యల్ని కలగజేయవచ్చు , గుండెపోటు , కార్డియాక్ అరెస్ట్ లాంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీయవచ్చు అని అన్నారు . కొన్ని పరిస్థితుల్లో కేవలం తీవ్రమైన , దీర్ఘకాలికమైన మలబద్ధకం వల్ల తలెత్తే ప్రాణాంతకమైన అనారోగ్య సమస్యలవల్ల రోగి ప్రాణం పోయే పరిస్థితికూడా తలెత్తచ్చు . నడుము , వీర్తి కడుపు , జననాంగం ప్రాంతాల్లో పట్టేసినట్టుగా ఉండడం , నొప్పి కలగడం , మల విసర్జన సమయంలో తీవ్రమైన అసౌకర్యం కలగడం , నొప్పి కలగడం మలబద్ధకం సాధారణమైన లక్షణాలు . మలబద్ధకానికి సకాలంలో సరైన పరిష్కారం కనుగొనకపోతే మలంలో ఉన్న హానికరమైన బ్యాక్టీరియా , విషపదార్థాలు తిరిగి రక్తంలోకి చేరే ప్రమాదం ఉంటుందని తెలిపారు . దానివల్ల సెప్టిసిమియా అనే శరీరం మొత్తం ఇన్ ఫెక్షన్ వ్యాపించి , విషతుల్యమయ్యే పరిస్థితి తలెత్తవచ్చు . మలద్వారం బైటికి చొచ్చుకురావడం , వాయడం , విపరీతంగా రక్తం , చీము కారడం , మూత్ర విసర్జన స్తంభించిపోవడం లాంటి ప్రమాదకరమైన పరిస్థితులకు మలబద్ధకం దారి తీయవచ్చు . ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో రోగిని వెంటనే ఆసుపత్రిలో చేర్పి ఆగమేఘాల మీద శస్త్ర చికిత్స చేయాల్సిన పరిస్థితి కూడా రావొచ్చని అన్నారు . ఒక్కోసారి ఇలాంటి పరిస్థితి ప్రాణాంతకం కూడా కావచ్చు . మలబద్ధకం సమస్యతో బాధపడేవాళ్లు తరచూ గట్టిగా , పిట్టం కట్టినట్టుగా ఉండే మలాన్ని విసర్జించడానికి నానా అవస్థలు పడతారు . మల విసర్జన సమయంలో మల ద్వారం చివళ్లు పగిలి తరచూ రక్తం కారుతుంటుంది . మలబద్ధకంతో బాధపడేవారిలో ఎక్కువమంది వంగడానికి , కూర్చోవడానికి , నడవడానికి లేదా లైంగిక సంపర్కానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు . వయసుతో నిమిత్తం లేకుండా ఈ సమస్య ఎవరికైనా రావచ్చు . కొన్ని అధ్యయనాల ప్రకారం నూటికి 16 శాతం మంది పెద్దలు మలబద్ధకం లక్షణాలు , సమస్యలతో బాధపడుతున్నారని తేలింది .60 సంవత్సరాలకు పైబడిన వృద్ధుల్లో మూడింట రెండు వంతుల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి అని అన్నారు . దీర్ఘకాలంగా మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నవారిలో 30 నుండి 67 శాతం మందికి మలద్వారం బైటికి చొచ్చుకొస్తుంది . మల విసర్జన సమయంలో పెద్దప్రేగు టిష్యూ బైటికి చొచ్చుకొచ్చి తిరిగి లోపలికి వెళ్లకుండా అలాగే బైటే ఉండిపోతుంది . దీనివల్ల మల విసర్జన మరింత కష్టతరం అవుతుంది . సకా లంలో సరైన చికిత్స తీసుకో కపోతే బైటికి చొచ్చుకొచ్చిన మలద్వారం టిష్యూ క్షీణించ డం , కణజాలం చచ్చుబడ పోవడం, సరైన రక్త ప్రసరణ లేక కుళ్లిపోవడం లాంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. వైద్య పరిభాషలో దీన్ని గ్యాంగ్రేన్ అంటారు . దీనికి అత్యవసర శస్త్రచికిత్స చాలా అవసరం అని పేర్కొన్నారు. మ బద్ధ




కంతో బాధపడేవారు పేగు టిష్యూ బైటికి చొచ్చుకొస్తున్నట్టు అనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి . మల విసర్జన సమయంలో మల ద్వారం చిట్లి రక్తస్రావం కావడం , తరచూ ఆకస్మికంగా తీవ్రమైన కడుపునొప్పి రావడం , ఊహించని రీతిలో శరీరం బరువు తగ్గిపోవడం , గ్యాస్ , జ్వరం , వాంతులు , వెన్నునొప్పి , మలద్వారం వాపు , మూత్ర విసర్జన స్తంభించిపోవడం లాంటి లక్షణాలను గమనించగానే రోగి వెంటనే సరైన వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం ఉందన్నారు . మలద్వారం వాచిపోయి విపరీతంగా రక్తస్రావం అవుతూ , మూత్ర విసర్జన పూర్తిగా స్తంభించిపోయిన 60 సంవత్సరాల వృద్ధుడిని అతని బంధువులు హైదరాబాద్ మలక్ పేటలోని యశోదా ఆసుపత్రికి తీసుకొచ్చారు . ఆ రోగి దీర్ఘకాలంగా మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నాడు . 4 నెలలుగా మలద్వారం బైటికి చొచ్చుకొచ్చి వాచిపోయి రక్తస్రావం అవుతున్న స్థితిలో తను విపరీతంగా బరువు తగ్గిపోయాడు . ఆసుపత్రికి వచ్చేనాటికి 3 రోజులనుండి బైటికి చొచ్చుకొచ్చిన మల ద్వారం వల్ల తీవ్రమైన నొప్పిని అనుభవిస్తూ మల విసర్జన చేయలేకపోతున్నాడు . ప్రేగులో మలం పెద్దఎత్తున పేరుకుపోయి మూత్రాశయాన్ని నొక్కేయడంతో మూత్ర విసర్జన కూడా స్తంభించిపోయింది . వైద్య పరీక్షల్లో ఆ రోగికి మలద్వారం తీవ్రస్థాయిలో బైటికి చొచ్చుకొచ్చి వాచినట్టుగా తేలింది . దాదాపు 15 సెంటీమీటర్ల మేర బైటికి చొచ్చుకొచ్చిన మలద్వారం విపరీతంగా వాచిపోయి తీవ్రస్థాయిలో మంటపుడుతోంది . మల విసర్జన చేయలేని స్థితిలో లోపల పేగులో పెద్ద ఎత్తున మలం పేరుకుపోవడంవల్ల మూత్రాశయం బాగా ఒత్తుకుపోయి అతనికి మూత్ర విసర్జన కూడా స్తంభించిపోయింది . అలాంటి స్థితిలో యశోదా ఆసుపత్రి వైద్య బృందం తో ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఎమ్.మణిశేఖరన్ అత్యవసర శస్త్ర చికిత్స చేసి , బైటికి చొచ్చుకొచ్చిన మల ద్వారాన్ని కత్తిరించి , కుట్లువేసి రోగి ప్రాణాలను కాపాడారు . యూరాలజిస్ట్ సిస్టోస్కోపీ చేసి బైటికి చొచ్చుకొచ్చిన మల ద్వారం స్థితిని పరిశీలించారు . వారం రోజుల తర్వాత ల్యాప్రోస్కోపిక్ విధానంలో మెష్ రెక్టోపెక్సీ చేశారు . తర్వాత 3 నెలలపాటు రోగిని పరిశీలించిన వైద్యులు తర్వాత థెరిచ్ వైర్ ని తొలగించారు . ఆ తర్వాత రోగి ఎలాంటి అనారోగ్యపరమైన సమస్యలూ లేకుండా మల బద్ధకం సమస్యనుండి , మూత్ర విసర్జన స్తంభన సమస్యనుండి పూర్తిగా కోలుకున్నాడు అని తెలిపారు . నిపుణులైన యశోదా ఆసుపత్రి వైద్య బృందం సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు , యశోదా ఆసుపత్రి అందిస్తున్న అంతర్జాతీయ స్థాయి అత్యాధునికమైన వైద్య సేవలకు ఈ కేసు కూడా మరో చక్కటి ఉదాహరణ అని అన్నారు . హైదరాబాద్ మలక్ పేట యశోదా ఆసుపత్రిలో మాత్రమే కాక యశోదా ఆసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని , నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు , వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని డైరెక్టర్ గోరుకంటి పవన్ , యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి , శ్రీనివాస్ చిదుర తెలిపారు . మరిన్ని వివరాలకోసం ఈ క్రింది నెంబర్లను ( ఎ.వాసుకిరణ్ రెడ్డిని )9705771230 / 9949998378 సంప్రదించగలరని అన్నారు . ఈ కార్యక్రమంలో పేషంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# బంధం విజయ లక్ష్మి దశదిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

బోనకల్, మే 2, ప్రజాజ్యోతి:

మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో మాజీ మధిర మార్కెట్ చైర్మన్ బంధం శ్రీనివాసరావు సతీమణి విజయలక్ష్మి దశ దిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తెలంగాణా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షులు పూజ్యులు వాసిరెడ్డి రామనాథం పాల్గొన్నారు. విజయలక్ష్మి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, ముష్టికుంట్ల గ్రామ శాఖ అధ్యక్షులు బంధం హుస్సేన్, మండల ఉపాధ్యక్షులు బంధం. రంగయ్య, మండల టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షులు బంధం అనిల్ కుమార్, సంఘూరపు బుచ్చిబాబు, జల్ల. కృష్ణ, దుగ్గి. భద్రయ్య, కాంగ్రెస్ పార్టీ రజక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తమ్మారపు బ్రహ్మయ్య, సంగరపు శ్రీనివాసరావు, నల్లమోతు నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

